# హంసలను వేటాడొద్దు [20]

మూలం: బోరిస్ వాసిల్యేవ్

అనువాదం: కె. సురేష్



**అనువాదం:** హంసలను వేటాడొద్దు [20]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యెవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: సెప్టెంబరు 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=3504

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# హంసలను వేటాడొద్దు [20]

దీని ముందు భాగం

**జరిగిన కథ:** నోనా యురీవ్నా పాఠశాలకు సామగ్రి కొనడానికి అన్న నెపంతో పట్టణానికి వస్తుంది. యూరి పెట్రోవిచ్ గదిలో బస చేస్తుంది. ఆ రాత్రి ఇద్దరి మధ్య శారీరక ఆకర్షణ దోబూచులాడుతుంది. ఇద్దరూ ఒకటవుతారు. యూరీ తనకు ఇదివరకే పెళ్లయిన సంగతి చెప్తాడు. కానీ ఆమె ఇప్పుడు అతనితో కలిసి ఉండటం లేదు. నోనా అదేం పెద్ద విషయం కాదన్నట్టు ప్రవరిస్తుంది. అక్కణ్ణించి వెళిపోతుంది. కొన్ని రోజుల తర్వాత ఆమె కోసం ఊరు వచ్చిన యూరీకి ఆమె అక్కడ లేదని, లెనిన్‌గ్రాడ్ వెళ్లిందనీ తెలుస్తుంది. ఇప్పుడు అటవీ అధికారి ఐన యెగార్‌కు మాస్కో నుంచి ఏదో సమావేశానికి రమ్మని ఆహ్వానం అందుతుంది. అతను బయల్దేరే ముందు తోడల్లుడు ఫ్యొడార్ ఇపటొవిచ్ భార్య మారిట్సా వచ్చి తన భర్తను చట్టం బారి నుంచి తప్పించమని ప్రాధేయపడుతుంది. యెగార్ అవుననడు, కాదనడు. అతనెక్కిన రైలు మాస్కో బయల్దేరుతుంది. **ఇక చదవండి:——**

## 20

జిల్లా కేంద్రంలో యూరి పెట్రోవిచ్ లేకపోయేసరికి యెగార్ డీలాపడిపోయాడు. మాస్కో రైలు ఎక్కాడన్న మాటేగాని అతడిలో ఏమాత్రం ఉత్సాహం లేదు. యూరి పెట్రోవిచ్ రైలు టికెట్టు ముందుగానే తీసుకుని యెగార్‌కి ఇవ్వమని హోటలులో ఇచ్చిన మాట నిజమే. చువలోవ్ ఎక్కడికి వెళ్లాడో తెలియలేదు కానీ అతడు కూడా ప్రయాణమయ్యాడు.

యెగార్ జీవితంలో మొదటిసారి స్లీపరు బర్తులో ప్రయాణిస్తున్నాడు. తక్కువ సామానుతో ప్రయాణిస్తున్న అతడి వద్ద దుప్పటి కూడా లేదు. అతడి తోటి ప్రయాణికులు చాలా ముఖ్యమైన మనుషులు మాదిరి ఉన్నారు, ఏవేవో విషయాలు మాట్లాడుకుంటున్నారు. కానీ యెగార్ వాళ్ల మాటల్లో మాట కలపలేదు. యూరి పెట్రోవిచ్ నుంచి అతడికి అంతిమ సందేశం అందకపోవటంవల్ల ఆ సంభాషణలో పాలుపంచుకోవాలని అతడికి అనిపించలేదు. దుప్పటి లేకపోవటంవల్ల ఆ రాత్రి అతడికి సరిగా నిద్ర కూడా పట్టలేదు. ఇతరులకు నిద్రాభంగం

కలిగిస్తానని అతడు అటూ, ఇటూ మెసలను కూడా మెసల్లేదు. తెల్లవారేసరికి నిద్రలేమి కారణంగా అలసటే కాకుండా, కట్టెలాగా బిగుసుగుపోయి వళ్లు నొప్పులుగా కూడా ఉంది.

యెగార్‌ని మాస్కో స్టేషనులో ఎవరో కలిసి హోటలుకి తీసుకుని వెళ్లటం వల్ల అతడి భయాలు, ఆందోళనలు తొలగిపోయాయి.

హోటలుకి చేరుకున్న తరువాత అతడిని తోడ్కొని వచ్చిన మనిషి, “నువ్వు గోష్ఠిలో మాట్లాడవలసి రావచ్చు,” అని చెప్పాడు.

“ఎక్కడ?”

“గోష్టిలో” ఆ యువకుడు ఒక కాగితం తీసి బల్లమీద పెట్టాడు. “నువ్వు ప్రతిపాదించవలసిన అంశాలు కొన్నింటిని తయారు చేశాం. వీటిని బాగా అవగతం చేసుకో.”

“అహ్-అలాగే,” అన్నాడు యెగార్. “ఇక్కడికి జూ చాలా దూరమా?”

“జూనా?” ఆ యువకుడు ఆశ్చరంగా అడిగాడు. “అది క్రాస్నోప్రెస్నెన్‌స్కాయా మెట్రో స్టేషను దగ్గర ఉంది. రేపు ఉదయం పదిగంటలకల్లా సభాస్థలి వద్ద ఉండాలి.”

“ఇంకా ముందుగానే అక్కడికి చేరుకుంటాను.”

యువకుడు వెళ్లగానే యెగార్ హోటలులో ఏదో తిన్నాననిపించి తాను వెళ్లవలసిన మెట్రోస్టేషనుకి దారి అడిగాడు. తటపటాయిస్తూ లిఫ్టు ఎక్కి తొలిసారిగా మాస్కో మెట్రో కోసం భూగర్భంలోకి దిగాడు.

జూకి చేరుకున్న తరువాత ప్రతి బోనుముందు చాలాసేపు గడిపాడు. ఏనుగు ఉన్న చోటుకి చేరుకునేసరికి అక్కడే అతుక్కుపోయాడు. సందర్శకులు వచ్చి, చూసి వెళ్లిపోతున్నారు, కానీ తాను నిజమైన ఏనగుని చూస్తున్నాన్న నమ్మకం కుదరక యెగార్ అక్కడే ఉండిపోయాడు. ఈ ఏనుగు బజారులో తిరగటం లేదన్నది వాస్తవమే. కట్టుదిట్టం చేసిన ప్రదేశంలో అది నిలబడి ఉంది. అయితే అది చాలా స్వేచ్ఛగా వ్యవహరిస్తోంది: వంటిమీద ఇసుక చల్లుకుంటోంది, పిల్లలు విసిరేసిన బన్నులను వాసన చూసి తింటోంది. ఏనుగు ప్రతి కదలికను యెగార్ అనుసరించసాగాడు. ప్రతిదీ గుర్తుంచుకుని, ఆ తరువాత వాటిని కోల్కాతో పంచుకోవాలన్నది అతడి కోరిక. అతడి ఆసక్తిని చూసి జూ అటెండెంటు ఒకతను పలకరించాడు, “మంచి పశువు, కదా?”

“పశువుకాదు – జంతువు,” యెగార్ సరిచేసాడు.

"నిజమే" ఆ అటెండెంటు పెద్ద వయస్సువాడు. అతడితో మాట్లాడటం యెగార్‌కి ఇబ్బంది కలగలేదు. "భయపడాల్సింది లేదుకదా?"

"దేనికి? నీకు భయంలేదు కదా?"

"లేదు."

"అయితే, ఇటు వచ్చి నాకు సహాయం చెయ్యి. ఏనుగుకి ఆహారం పెట్టానని మీ పట్టణంలో గొప్పలు చెప్పుకోవచ్చు."

"నేనొక చిన్న పల్లెలో ఉంటాను."

"అయితే మరింతగా గొప్పలు చెప్పుకోవచ్చు."

యెగార్‌ని అటెండెంటు శీతాకాలపు నివాస స్థలానికి తీసుకెళ్లాడు. అక్కడ మరో చిన్న ఏనుగు ఉంది. అది బీట్‌రూట్లు, క్యారెట్లు తింటోంది. తన నల్లటి తొండంతో యెగార్‌ని మెల్లగా వాసన చూసింది.

"తెలివైన జంతువు!" యెగార్ తన్మయత్వంతో అన్నాడు.

యెగార్‌కి అతడు జూ అంతా చూపించి ఏ జంతువుకి ఏ ఆహారం పెడతారో వివరించాడు. యెగార్‌ని కోతుల దగ్గరకు తీసుకెళ్లాడు గానీ, అతడికి అవి నచ్చలేదు.

"గోలగోలగా అరుస్తున్నాయి."

ఉద్యోగస్తుల క్యాంటీన్‌లో ఇద్దరు కలసి భోజనం చేసి తమ స్నేహాన్ని బలపరుచుకున్నారు. యెగార్ అతడికి సమావేశం గురించి, తమ ఊరి గురించి, ప్రత్యేకించి నల్లచెరువు గురించి చెప్పాడు.

"ఒకప్పుడు అది హంసలచెరువు, ఇప్పుడది నల్లచెరువుగా మారింది."

"సజీవ అందం అంతరించిపోతోంది," అటెండెంటు నిట్టూర్చాడు. "కొంత కాలం తరువాత జూలో తప్పించి బయట మనకు ఇవేవి కనపడవు."

"కానీ, ఎంతైనా జూ ప్రకృతికి సరిపోదు కదా."

"అవును – దాంట్లో సందేహం లేదు."

అందరికంటే ఆఖరున యెగార్ జూలోంచి బయటకు వచ్చాడు. ఆపాటికి దుకాణాలన్నీ మూసేసారు.

ఒక్క క్షణంపాటు అతడు ఆలోచనలో పడ్డాడు. యూరి పెట్రోవిచ్ చెప్పిన కథ, అతడు ఇచ్చిన చిరునామా గుర్తుకు వచ్చాయి. అక్కడికి ఎట్లా వెళ్లాలో ఒక పోలీసుని అడిగాడు.

అతడి మనసులో స్పష్టమైన ఉద్దేశమేమీ లేదు, కానీ చువలోవ్ విచార వదనమే అతడికి గుర్తుకొస్తోంది.

లిఫ్టు ఎలా ఉపయోగించాలో తెలియక తొమ్మిది అంతస్తులు ఎక్కి పైకి వెళ్లాడు. శ్వాస తీసుకోటానికి కాసేపు ఆగి, ఫ్లాటు ఏదో తెలుసుకుని బెల్లు కొట్టాడు.

"హలో," టోపీ తీస్తూ యెగార్ ముందుగానే అన్నాడు, "నేను మరీనా కోసం చూస్తున్నాను."

"మరీనాని నేనే."

పొడవు జుట్టు ఉన్న ఆ అమ్మాయి చూపులు స్నేహపూర్వకంగా లేవు. దాంతో యెగార్‌కి తలుపు దగ్గర నుంచునే సంభాషణ మొదలుపెట్టటం తప్పించి మరో మార్గం లేకపోయింది.

"నేను చువలోవ్ స్నేహితుడిని. నా పేరు యూరి పెట్రోవిచ్."

ఏం చేయాలో నిర్ణయించుకోలేకపోతున్నట్టు, ఆ తటపటాయింపు భయంతో కూడుకున్నట్టు ఆమె ముఖ కవళికలు స్పష్టపరుస్తున్నాయి.

చివరికి రెండో గది తలుపులు వేస్తూ, "అలాగా," అంది. "లోపలికి రా, వంటింట్లోకి."

తన టోపీ ఎక్కడ పెట్టాలో తెలియక దానిని చేతిలోనే పట్టుకుని యెగార్ వంటింట్లోకి నడిచాడు.

ఇంకెటూ వెళ్లకుండా అన్నట్టు అతడి వెనువెంటనే ఆమె నడిచింది.

"ఎవరది, ప్రియా?" అవతలి గదినుంచి ఒక పురుషుడి గొంతు వినిపించింది.

"నాకోసం వచ్చారులే," వంటింటి తలుపు వేస్తూ ఆమె బదులు ఇచ్చింది. "ఎందుకొచ్చావు?"

ఆమె అతడిని కూర్చోమనకపోవటం యెగార్‌కి సౌకర్యంగా అనిపించింది.

బయట నిలబడి ఉండగా ఏమి చెప్పాలో, ఎలా చెప్పాలో అతడికి తెలియలేదు. కానీ ఇప్పుడంతా స్పష్టంగా ఉంది.

"అవతల గదిలో ఉన్నది నీ భర్త అనుకుంటా?"

"దాంతో నీకేమిటి?"

"నాకేమీ లేదు, కానీ అతడికి, ఇప్పుడు పనిబడింది."

"బెదిరించటానికి ఇక్కడికి వచ్చావా?"

"అలాగని ఎందుకనుకుంటున్నావు? నువ్వు నీకు కావలసినట్టు జీవితాన్ని జీవిస్తున్నావు, కానీ ఇంకొకరికి అడ్డు పడుతున్నావు. ఇది న్యాయంగా ఉందా?"

"నీకెంత ధైర్యం?"

"ఎందుకు ఉండకూడదు?" మెల్లగా అన్నాడు యెగార్. "నీ బుసబుసలు, రుసరుసలు చాలించు. అతడు నీకేం అపకారం చేశాడు?"

"చాలా" ఆమె చిరాకుగా మొహం పెట్టి సిగరెట్టు వెలిగించుకుంది. "అదంతా వివరించి ప్రయోజనం లేదు: అతడికి ఇంకా అర్థం కాకపోతే ఎప్పటికీ కాదు."

"వివరించు," అంటూ యెగార్ అక్కడ ఉన్న చిన్న, ఎర్ర స్టూలు మీద కూర్చున్నాడు. "అందుకే నేను ఇక్కడికి వచ్చాను."

"నిన్ను ఇక్కడినుంచి తన్ని తగలేస్తాను. అంతకుమించి నీకు వివరణ ఏమీ లభించదు."

"ఆ పని నువ్వు చెయ్యలేవు," అన్నాడు యెగార్. "ఒకప్పుడు అలా చేసి ఉండేదానివేమో, కానీ ఇప్పుడు కాదు. నీ వెనక తలుపులు వేసి వచ్చావంటే నీ కుటుంబానికి విలువనిస్తున్నావని అర్థమౌతోంది."

"మరిన్ని బెదిరింపులా? చూడు, నాకు –"

"కొద్దిగా మంచినీళ్లు ఇస్తావా," నిట్టూరుస్తూ అడిగాడు యెగార్. "హోటలులో తిన్నదానికి కడుపులో మంటగా ఉంది."

అరలోంచి ఒక గ్లాసు తీసి, "మంచినీళ్లేనా, దాంట్లోకి ఐసు కూడా కావాలా?" అంటూ వ్యంగ్యంగా అడిగింది.

దానికి యెగార్ ఆశ్చర్యపోతూ, "మంచినీళ్లు చాలు," అన్నాడు.

"మంచినీళ్లు..." ఢఢాలుమంటూ గ్లాసుని బల్లమీద పెట్టటంతో నీళ్లు చిందిపడ్డాయి. "తాగి ఇక వెళ్లు. పిల్లవాడికి తండ్రి అతడు కాదని చువలోవ్‌కి చెప్పు."

ఏం మాట్లాడుకుండా రుచీ, పచీ లేని మాస్కో నీళ్లను మెల్లగా తాగసాగడు యెగార్.

కిటికీ దగ్గర నిలబడి సిగరెట్టు తాగుతున్న ఆమె భుజం మీదనుంచి అతడివైపు కోపంగా చూస్తోంది.

"నానుంచి ఇంకేమి కావాలి నీకు?"

"నాకా?" యెగార్ ఆమె వైపు చూసాడు: ఆమె అంత పొగరుగా ఎందుకు వ్యవహరిస్తోంది? "కానీ అతడు నీ భర్త."

"భర్త!" ఆమె భుజాలు విరుచుకుని మొహం అసహ్యంగా పెట్టింది.

"మీ చువలోవ్ దుంగ మీద బుడిప లాంటివాడు."

"తిట్టటం పొగడటం కాదు: ఎంత తిట్టినా అలసిపోవు."

"స్త్రీని అవమానించి గమనించకపోవటం – అదేమైనా పెద్దమనిషి తరహానా!"

"అతడు అటువంటి మనిషి కాదే," యెగార్ అనుమానంగా అన్నాడు. "యూరి పెట్రోవిచ్ గౌరవనీయ వ్యక్తి."

"గౌరవనీయుడా?!" మరీనా వెక్కిరింతగా అంది. "నిజాయితీగా చెప్పు: ఒక మహిళ, ఒకవేళ, బలహీన క్షణంలో, క్షణికాకర్షణలో ఒక వ్యక్తితో పడు–" ఆమె మధ్యలోనే ఆపేసి, "అదే, ఒక రాత్రి గడిపితే మరునాడు ఉదయం డబ్బులు ఇవ్వాలన్న ఇంగిత జ్ఞానం ఉండొద్దా?"

"నాకా ఇంగిత జ్ఞానం ఉండొచ్చు, కానీ డబ్బులే లేకపోవచ్చు."

"అది చాలదన్నట్టు, నేను అతడిని ప్రేమిస్తున్నానో లేదో తెలుసుకోకుండా నన్ను లాక్కెళ్లి నా పాస్‌పోర్టులో ఆ వెధవ ముద్ర వేయించాడు."

"అందుకు నిన్నేమన్నా బలవంత పెట్టాడా?"

“అదేం ప్రశ్న,” ఆమె అకస్మాత్తుగా నవ్వింది. “నేను మూర్ఖురాలిగా వ్యవహరించాను – అదేగా నీకు కావలసింది? మొదట్లో నాకు కూడా ఆ ఆలోచన బాగుందనిపించింది: చాలా రొమాంటిక్‌గా అనిపించింది! ఆ తరువాత స్పృహలోకి రాగానే అక్కడినుంచి పారిపోయి వచ్చాను.”

“పారిపోయావు,” యెగార్ ఎగతాళిగా అన్నాడు. “మరి ముద్ర సంగతి ఏమిటి? దానినుంచి ఎలా పారిపోతావు?”

పొడవు జుట్టు అమ్మాయి మౌనం ఆందోళనకరంగా ఉంది. ఆమెను చూస్తే యెగార్‌కి ఉన్నట్టుండి జాలి కలిగింది. సంభాషణ సమయంలో వాళ్ల పాత్రలు తారుమారైనట్టు ఉన్నాయి: ఇప్పుడు వంటింటిలో అతడే కీలక వ్యక్తి. ఆ విషయం ఆ ఇద్దరూ గుర్తించారు.

“నా పాస్‌పోర్టు పోయింది,” ఆమె స్వరంలో నేరభావన. “అతడు కూడా అదే చేస్తే పోలా, ఏం?”

“నువ్వు మోసంచేసి అతడిని కూడా అదే చెయ్యమంటున్నావా? కొత్త వ్యక్తితో ఎలా ఉంది?”

“అంతా బాగుంది.”

“చట్టప్రకారం మీ సంబంధం ఏమిటని... “

“మేం చట్టబద్ధంగా వివాహం చేసుకున్నాం.”

“అయ్యో, దేవుడా!”

యెగార్ ఒక్కసారిగా పైకి లేచి, వంటింట్లో అటు, ఇటు పచార్లు చెయ్యసాగాడు. అతడి కదలికలను మరీనా శ్రద్ధగా గమనిస్తోంది, ఆ గమనింపులో పిల్లల మాదిరి విశ్వాసం ప్రకటితమౌతోంది.

“మీరిద్దరూ బాగానే ఉన్నరన్నావు కదూ?”

“ఆ–అవును.”

“అతడిని ఇక్కడికి పిలువు.”

“ఏమిటి?” ఆమె క్షణంలో మళ్లీ బిగుసుకుపోయి, కోపంగా మారిపోయింది. “ఈ క్షణమే ఇక్కడినుంచి బయటకు నడువు. లేకపోతే పోలీసులను –”

“అయితే పోలీసులను పిలువు,” యెగార్ ప్రశాంతంగా అంటూ మళ్లీ కూర్చున్నాడు.

మరీనా కిటికీవైపుకి తిరిగింది. జారిపోయిన భుజాలను నిస్సహాయంగా ఎగరేసింది. తన భర్తను తలుచుకని భయపడి ఆ అపరిచితుడి ముందు ఆమె నిశ్శబ్దంగా రోదించసాగింది.

యెగార్ నిట్టూర్చాడు. "ఈ విషయం బయటపడినప్పుడు మరీ సమస్య అవుతుంది: ఎంతలేదన్నా చట్ట అతిక్రమణ జరిగింది కదా."

"ఇక్కడినుంచి వెళ్లిపో!" ఆమె మెల్లగానే అరిచినంత పనిచేసింది. "అసలెందుకు వచ్చావు? నాకు బెదిరింపులంటే అసహ్యం!"

"ఏమిటీ నువ్వు అసహ్యించుకునేది?"

ఆమె ఏమీ మాట్లాడలేదు. యెగార్ తన టోపీని చేతుల్లో నలుపుతూ తలుపువైపు బయలుదేరాడు.

"ఆగు!"

యెగార్ ఆగలేదు. అతడు కావాలనే వంటిటంటి తలుపు శబ్దమయ్యేటట్టు వేసాడు. ఆమె కిటికీ దగ్గర కోపంగా, నిస్సహాయంగా ఏడవటం వినపడుతూనే ఉంది. అతడు రెండవ గది తలుపు తెరుచుకుని వెళ్లాడు.

బల్ల దగ్గర ఒక యువకుడు పుస్తకాలతో కుస్తీ పడుతున్నాడు. అతడు తలెత్తి యెగార్‌తో చూపులు కలిపాడు, కళ్లు మిటకరించి నవ్వాడు. తరువాత, "ఈ పని పూర్తి చెయ్యటానికి తంటాలు పడుతున్నాను. సెప్టెంబరులో నాకు పట్టా వస్తుంది."

ఆ గదిలో ఒక మూలనున్న ఉయ్యాలలో ఒక పిల్లవాడు నిద్రపోతూ ఉన్నాడు. ఆ యువకుడు వళ్లు విరుచుకుంటూ వివరించాడు, "రాత్రి కాళాశాలకు వెళుతున్నాను. చాలా కష్టపడాల్సి వస్తోంది!"

బహుశా, ఆ గదిలో చాలా నిశ్శబ్దంగా ఉందేమో, యెగార్‌కి ఒక్కసారిగా రెండు చెవులూ వినిపించకుండా పోయాయి, దాంతో అతడికి తుమ్మెదల ఝుంకారం మాత్రమే వినిపించసాగింది. జాలితో అతడి గుండె బరువెక్కిపోయింది. అతడి గొంతు మూగవోయింది, చుబుకం వణకసాగింది. వంటింట్లో మరీనా ఏడ్పుతో కూడిన ఎక్కిళ్లు యెగార్‌కి వినిపిస్తున్నాయి.

"పట్టువదలకు," అని ఆ యువకుడికి చెప్పి మెల్లగా గదిలోంచి బయటకు వచ్చాడు.

యెగార్ హోటలుకి తిరిగి వచ్చేసరికి బాగా ఆలస్యమయ్యింది. హోరిటీనా పెట్టిచ్చిన రొట్టె తిని, ఒక గ్లాసు నీళ్లు తాగి పడుకున్నాడు. అతడికి అలవాటు ఉన్నదానికంటే మంచం మెత్తగా ఉన్నప్పటికీ ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టలేదు; అటు తిరుగుతూ, ఇటు తిరుగుతూ, నిట్టూరుస్తూ రాత్రంతా గడిపాడు.

ఆ మరునాడు అతడు లేద్దామనుకున్నదానికంటే బాగా ఆలస్యంగా నిద్ర లేచాడు. కాలకృత్యాలు తీర్చుకుని కింద క్యాంటీన్‌కి వెళ్లాడు. అక్కడ చాలామంది వరసలో ఉన్నారు. అక్కడున్నంతసేపు ఆలస్యం అవుతుందేమోనని అతడు ఆందోళన పడుతూనే ఉన్నాడు.

హడావిడిగా తిన్నాననిపించి సమావేశ స్థలానికి పరిగెత్తాడు. ప్రతిపాదనలతో అతడికి ఇచ్చిన కాగితాన్ని చూడలేదు సరికదా దానిని గదిలోనే మరిచిపోయాడు.

తన పేరు పిలిచినప్పుడు గానీ అతడికి ఆ కాగితం సంగతి గుర్తుకు రాలేదు.

"...ఉదాహరణకు యెగార్ పొలుష్కిన్‌లాంటి వాళ్లను తీసుకోండి. అతడి నిస్వార్థ సేవ ద్వారా నిరాసక్తికరమైన పని అంటూ ఉండదని, పని పట్ల నిరాసక్తికరమైన దృక్పథం మాత్రమే ఉంటుందని నిరూపించాడు. కామ్రేడ్స్, పొలుష్కిన్ తన పనిని ఎలా అర్థం చేసుకున్నాడో ఇప్పుడు నేను చెప్పబోవటం లేదు: కొంత సేపట్లో అతడే ఆ విషయాలు చెపుతాడు. నేను చెప్పదలుచుకుందల్లా..."

మంత్రిగారు ఏం చెప్పదలుచుకున్నారో ఆ తరువాత యెగార్ వినలేదు. అతడి వళ్లంతా చల్లటి చమటలతోటి తడిచిపోయింది: కాగితాలు హోటలులో ఉండిపోయాయి, వాటిల్లో ఏముందో యెగార్‌కి ఇసుమంతైనా అవగాహన లేదు. మిగిలిన ఉపన్యాసం అంతసేపూ ఎలాగో ఉగ్గబట్టుకుని కూర్చుని విరామం ప్రకటించగానే అతడు తలుపువైపుకి నడవసాగాడు. హోటలుకి వెళ్లి ఆ కాగితాలు త్వరగా తెచ్చుకోవాలన్న ప్రయత్నంలో ఉన్నాడు. తలుపు దాకా చేరుకున్నాడో లేదో ఎవరో మైకులో ప్రకటిస్తున్నారు:

"యెగార్ పొలుష్కిన్‌ని వేదిక మీదకు రావలసిందిగా కోరుతున్నాను. మరొకసారి... "

"నన్నేనా పిలుస్తుంట?" యెగార్ తన పక్కనున్న వ్యక్తినిఅడిగాడు. అతడు బయటకు వెళ్లటానికి తలుపు నెడుతున్నాడు.

"నువ్వు పొలుష్కిన్‌వి అయితే, పిలిచేది నిన్నే... "

"అహ్-అలాగా!" అంటూ యెగార్ వెనక్కి తిరిగి వేదికవైపుకి నడవసాగాడు.

మంత్రి స్థానంలో పోడియం దగ్గర చైర్మన్ ఉన్నాడు, అతడి చుట్టూ కొంతమంది మూగి ఉన్నారు. తనని ఎందుకు పిలిచారని యెగార్ అడగగానే వాళ్లందరూ అతడివైపుకి తిరిగి తమ కెమేరాలు సిద్ధం చేసుకున్నారు.

"కొన్ని ఫొటోలు తీసుకుంటాం. కొంచెం ఇటు తిరగండి."

వాళ్లు తిరగమన్నట్టల్లా యెగార్ తిరుగుతున్నాడే కానీ సమయం వృధా అవుతోందన్న అసహనంతో ఉన్నాడు. ఆ తరువాత వాళ్లు ప్రశ్నల వర్షం కురిపించారు: అతడు ఎవరు, ఎక్కడి నుంచి వచ్చాడు, అతడి ఆలోచనలు ఏమిటి. అతడేదో ప్రత్యేకంగా మాట్లాడుతున్నానని అనుకోలేదు కాబట్టి వివరంగానే చెప్పాడు. దాంతో ఆ సంభాషణ చాలాసేపే కొనసాగింది. అతడు గుర్తించే లోపు విరామ సమయం అయిపోయింది. యెగార్ అక్కడినుంచి తప్పుకున్నాడు కానీ బయటకు వెళ్లటానికి వీలులేక తిరిగి తన స్థానంలో కూర్చున్నాడు. ఇక మళ్ళీ విరామం ప్రకటించినప్పుడే హోటలుకి వెళ్లిరావాలి.

మొదటి ఉపన్యాసకుడు ధారాళంగా మాట్లాడాడు. అతడు మాట్లాడింది యెగార్‌కి నచ్చి అందరికంటే ఎక్కువసేపు తప్పట్లు కొట్టటంతో తన పేరు పిలిచింది అతడికి మళ్లీ వినపడలేదు.

"యెగార్ పొలుష్కిన్, సిద్ధంగా ఉండాలి."

"ఏమంటున్నారు?"

"సిద్ధంగా ఉండమంటున్నారు."

"అంటే ఏమిటి?"

"ష్‌ష్‌ష్!" వెనకనుంచి ఎవరో వాళ్లని నిశ్శబ్దంగా ఉండమన్నారు.

ఏం మాట్లాడాలోనని ఆలోచించుకుంటూ యెగార్ మౌనంగా అయిపోయాడు. అతడికి బాగా చమటలు పట్టేసాయి. ఆ ఆలోచనల్లోపడి మాట్లాడుతున్న వ్యక్తి ఉపన్యాసం సగం విననే లేదు. రెండవ సగం విన్నాడు. దాంతో అతడు తీవ్రంగా విభేదించాడు. ఆ తరువాత కొంత ప్రశాంతత చేకూరింది.

"మనకి మరిన్ని చట్టాలు కావాలి," ప్రసంగం చేస్తున్న వ్యక్తి అంటున్నాడు, అతడి మాటలతో అతడే భయంకరంగా మారాడు. "మనం కఠినంగా వ్యవహరించాలి. శిక్షలు..."

ఎవరిని శిక్షించాలి? అనాసక్తితో – ఏదో మర్యాద కోసం – యెగార్ తప్పట్లు కొట్టాడు. అప్పుడు అతడి పేరు పిలవటం వినిపించింది:

"ఇప్పుడు యెగార్ పొలుష్కిన్ ఏం చెపుతాడో విందాం."

"నేనా?" యెగార్ లేచి నిలబడ్డాడు. "తరువాత మాట్లాడితే ఫర్వాలేదా? నేను, అది... కాగితాలు మరిచిపోయాను.'''

"ఏం కాగితాలు?"

"నేను మాట్లాడవలసినది రాసిచ్చిన కాగితాలు హోటలులో మరిచిపోయి వచ్చాను. ఒక్క నిమిషం ఆగండి. పరుగున వెళ్లి వాటిని తీసుకువస్తాను."

ప్రేక్షకులు అతడిని సరదాగా ఆట పట్టించసాగారు:

"కాగితాలు లేకుండా మాట్లాడు!"

"అది ఎవరు రాసారు?"

"రా, పొలుష్కిన్!"

"పోడియం దగ్గరికి పద," అన్నాడు ఛైర్మన్.

"ఎందుకు?" అంటూనే యెగార్ మెట్లవైపుకి కదిలి బయటకు వెళ్లబోయాడు. "చెప్పాను కదా, పరిగెత్తుకునివెళ్లి తీసుకని వస్తాను. వాళ్లు... అంటే ... అవి బల్లమీద ఉన్నాయి."

"వాళ్లు ఎవరు?"

"వాళ్లు నాకు కాగితాలు ఇచ్చారు, నేను వాటిని మరిచిపోయి వచ్చాను."

అతడి మాటలు వినపడనంత పెద్దపెట్టున శ్రోతలు నవ్వేసారు. కాని యెగార్ మనసు నవ్వులకు చాలా దూరంగా ఉంది. మైకు ముందు నేరభావనతో తలవంచుకుని నిలబడి నిట్టూర్చాడు.

"ఇతరులు రాసిన కాగితాలు లేకుండా మాట్లాడలేవా?" మంత్రి అడిగారు.

"అదీ, నేను... సరైన విషయాలు మాట్లాడకపోవచ్చు."

"సరైనదే మాట్లాడతావు. మైకు అందుకో. సిగ్గుపడకు, పొలుష్కిన్!"

యెగార్ అయిష్టంగా మైకు అందుకుని మంచినీటి గ్లాసులో పైకి లేస్తున్న బుడగలను చూడసాగాడు. శ్రోతలు మరుక్షణం నిశ్శబ్దంగా మారిపోయారు. అతడివంక తేరిపార చూస్తూ, అతడు చెప్పేది వినటానికి నవ్వుతూ ఎదురు చూస్తున్నారు.

“మంచి మనుషులారా!” యెగార్ పెద్దగా అన్నాడు. దాంతో శ్రోతలు మరోసారి పెద్దపెట్టున నవ్వారు. “మీ నవ్వులు ఒక్క నిమిషం ఆపండి: నేను మిమ్మల్ని మంచి చేసుకోవాలనుకోవటం లేదు. నేను మనుషులు మంచివాళ్లు అంటున్నాను!”

అందరూ ఒక్క క్షణం నిశ్శబ్దంగా మారిపోయారు. ఆ తరువాత సభ కరతాళధ్వనులతో మారుమోగింది. యెగార్ ముఖాన ఒక నవ్వు వ్యాపించింది.

“ఆగండాగండి, నేను ఇంకా మాట్లాడనే లేదు. ఇందాక ఒక వక్త మాట్లాడినదానితో నేను ఏకీభవించటం లేదు. అతడు మరిన్ని చట్టాలు కావాలంటున్నాడు. కానీ మనకు చట్టాలు చాలానే ఉన్నాయి.”

“అవును!” అన్నారు మంత్రి. “వాటిని ఉపయోగించుకుంటే చాలు.”

“అవసరం మనకు పాఠాలు నేర్పుతుంది,” అన్నాడు యెగార్. “అయితే ఆ అవసరం ఏర్పడకూడదని కోరుకుంటాను. సాయుధ సైనికులను నియమించి మన పని మనం చేసుకుంటూ ఉంటే పని తేలిక అవుతుంది. అయితే మనకు కావలిసినంత మంది సైనికులు ఉండరు.”

మళ్లీ కరతాళ ధ్వనులు మోగాయి. ఎవరో అరిచారు:

“ఇంకా చాలా ఉంది, మిత్రమా!”

“ఇదిగో, నన్ను గందరగోళపరచవద్దు — నా ధోరణిలో నన్ను చెప్పనివ్వండి. మీరు, నేను ఒక మంచి ఆశయం కోసం నిలబడ్డాం. మంచి ఆశయాలకు సంతోషంగా ఉండాలి, విచారంగా కాదు. చెడు నుంచి చెడు పుడుతుందని మనకు తెలుసు, అయితే మంచి నుంచి మంచి పుడుతుందని మనం మరిచిపోతుంటాం. అయితే అదే ముఖ్యమైన విషయం!”

యెగార్ అంతకు ముందెన్నడూ సభలో మాట్లాడలేదు, కాబట్టి అతడికి ప్రత్యేకంగా ఆందోళన ఏమీ లేదు. అతడిని మాట్లాడమన్నారు, అతడు మాట్లాడుతున్నాడు. అతడు పాట పాడినంతగా హాయిగా మాట్లాడసాగాడు.

“నా అనుభవం పంచుకోమన్నారు. పంచుకోవటం ఎందుకు? అందరూ ఒకేరకంగా చెయ్యటానికా? దానివల్ల ప్రయోజనం ఏముంది? గొర్రెల బొచ్చు కూడా వేరు వేరు రంగుల్లో ఉంటుంది. ఇక మనుషుల విషయానికి వస్తే దేవుడే అందరినీ వేరువేరుగా సృష్టించాడు. అంతా ఒకేరకంగా ఉండటం కోసం మనం పోరాడటంలేదు, తేడాల కోసం పోరాడుతున్నాం. అప్పుడు అందరం సంతోషంగా ఉంటాం.”

యెగార్ చెప్పేది నవ్వుతూ వింటున్నారు: అయితే అతడు చెప్పే ప్రతి మాట ఆసక్తితో వింటున్నారు. యెగార్ ఆ విషయం గుర్తించి సంతోషించాడు.

“అయితే ఈ రోజుల్లో సంతోషం అంతగా వెల్లివిరియటం లేదు. నేను నల్లచెరువు దగ్గర పని చేస్తున్నాను. ఒకప్పుడు దాని పేరు హంసలచెరువు. మన దేశంలో ఎన్ని నల్లచెరువులు ఉన్నాయనుకుంటున్నారు? ఆలోచించటానికే భయంగా ఉంది! కాబట్టి మనం వాటికి కొత్త పేర్లు ఇవ్వాలి: హంస, బాతు, కొంగ, ఏదో ఒకటి; నలుపు మాత్రం కాదు – అదీ మన పని!”

మళ్లీ కరతాళధ్వనులు మారుమోగాయి. తన కోసం పెట్టి ఉంచిన మంచినీటి గ్లాసువైపు యెగార్ ఓరగా చూసాడు, దాంట్లోంచి బుడగలు ఆగిపోవటంతో అతడు ఒక గుక్క తాగాడు. అతడు ముఖం చిట్లించాడు: ఆ నీళ్లు చప్పగా ఉన్నాయి.

“మనమంతా ఒకే ఇంట్లో ఉంటాం, కానీ అందరం యజమానులం కాదు. ఎందుకలా? మనుషులం అంతా గజిబిజి చేసేస్తాం. ఒకవైపున ప్రకృతి మన ఇల్లు అని నేర్పుతారు. కానీ ఇంకొకవైపు ఏమవుతోంది? ప్రకృతి తల్లిని మనం అణిచివేస్తున్నాం. అయితే ప్రకృతి తల్లి దానినంతటినీ భరిస్తోంది. ఆమె మెల్లమెల్లగా చనిపోతూ ఉంది. అయితే ఏ మనిషీ ఆమెకి ప్రభువు కాదు. తనని తాను ప్రభువని చెప్పుకోవటం హానికరం. మనిషి ఆమెకు కొడుకు మాత్రమే, ఆమె పెద్ద కొడుకు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలి – అమ్మని కాటికి పంపవద్దు.”

అందరూ తప్పట్లు కొట్టారు. చెయ్యి ఊపుతూ యెగార్ పోడియం నుంచి వెళ్లాడు. అయితే వెంటనే తిరిగి వచ్చాడు.

“ఒక్క నిమిషం, ఒక విషయం మరిచిపోయాను. ఈ వేసవిలో ఎవరైనా వినోద యాత్రలకు వెళ్లాలనుకుంటుంటే మా దగ్గరకు రండి. మా దగ్గర పుట్టకొక్కులు ఉన్నాయి, రేగుపండ్లు ఉన్నాయి,

పడవల అద్దె కేంద్రంతో యకోవ్ ప్రొకొపిచ్ ఉన్నాడు. పడవల మీద బొమ్మలు వేద్దాం – ఒక బాతుపిల్ల, ఒక పందిపిల్ల – ఆ తరువాత పడవల పందాలు వేద్దాం!"

సభ అంతా నవ్వులు, తప్పట్లతో నిండిపోగా అతడు తిరిగి తన స్థానానికి చేరుకున్నాడు.

ఆ సమావేశం రెండు రోజులపాటు జరిగింది. ఆ రెండు రోజులూ వేదిక వద్ద యెగార్ పేరును ప్రస్తావిస్తూనే ఉన్నారు. కొందరు అతనితో విభేదించారు. అడవులు చనిపోతుంటే మాటలవల్ల ప్రయోజనమేముంది? ఇతరులు అతడిని సమర్థించారు: మనం జయించింది ఇక చాలు. ఒక్క క్షణం ఆగి చుట్టూ పరికించి చూడాలి. నల్లచెరువులన్నింటినీ మళ్లీ సజీవంగా మార్చటానికి ప్రాధాన్యతనివ్వాలని మంత్రి ముగింపు సందర్భంగా తీర్మానించాడు, దీనిని యెగార్ పొలుష్కిన్ కార్యక్రమంగా ప్రకటించాడు. ఆ తరువాత యెగార్‌కి ప్రశంసా పత్రాన్ని ఇచ్చి, అందరూ మెచ్చుకున్నారు. అతడి ఖర్చులకు డబ్బులు, తిరుగు ప్రయాణానికి టిక్కెట్టు ఇచ్చారు.

యెగార్ హోటలుకి తిరిగి వెళ్లాడు. అతడి తిరుగు ప్రయాణం రేపు, ఆ రోజంతా దుకాణాలు తిరుగుతూ, సరుకులు కొంటూ గడిపి ఉండాల్సింది. తను తీసుకెళ్లాల్సిన సరుకుల జాబితాను చూసాడు యెగార్, తన దగ్గర ఉన్న డబ్బు లెక్కపెట్టుకున్నాడు, తనకిచ్చిన ప్రశంసా పత్రాన్ని సంతోషంగా చూసుకున్నాడు, ఆ తరువాత జూకి బయలుదేరాడు.

అక్కడి వాళ్లకు అర్థమయ్యేలా చెయ్యటానికి అతడికి చాలా సమయం పట్టింది. అందరికంటే పైఅధికారిని కలవాల్సివచ్చింది. అతడికి కూడా ఏదీ నమ్మశక్యంగా అనిపించటం లేదు.

"హంసలు ఏమిటి? ఇది వ్యాపార సంస్థ కాదు."

"నేనే వెళ్లి వాటిని పట్టుకుంటాను, అవి ఎక్కడ ఉన్నాయో చెప్పండి చాలు. ఇప్పుడు మాకున్నది నల్లచెరువు, కానీ ఒకప్పుడు అక్కడ హంసలు ఉండేవి. మంత్రి కూడా ఈ కార్యక్రమానికి నా పేరు పెట్టారు. ఇది నా పేరుతో ఉన్న కార్యక్రమం కాబట్టి నేనే మొదలుపెట్టాలి."

"కానీ నేను చెపుతున్నాను కదా –"

"నేను కూడా చెపుతున్నాను: ఇక్కడ కాకపోతే నాకు అవి ఎక్కడ దొరుకుతాయి? మీ దగ్గర చెరువు నిండా హంసలు ఉన్నాయి. కనీసం వాటిని నాకు అప్పుగా ఇవ్వండి, లేదా డబ్బులు తీసుకోండి."

అతడి వ్యవహార శైలి యెగార్‌కే ఆశ్చర్యం కలిగించింది: తన జీవితంలో ఎప్పుడూ అధికారులతో ఇలా మాట్లాడి ఉండలేదు. ఇప్పుడు అతడి మాటలకు, ధైర్యానికి కొదవ లేదు – అతడి హృదయంలో స్వేచ్ఛను అనుభూతి చెందుతున్నాడు.

వాళ్లు రోజంతా వాదించుకున్నారు. ఇంకా పైఅధికారులను కలిసారు, కొన్ని వినతి పత్రాలు తయారు తేసారు. చివరికి ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. దాని ప్రకారం యెగార్‌కి రెండు హంసలను ఇచ్చారు. వాటిని పంజరంలో పెడుతుండగా రెక్కలు టపటపా కొట్టుకున్నాయి; రక్తం కారేలా యెగార్‌ని పొడిచి పెట్టాయి. ఆ తరువాత రైల్వేస్టేషనుకి పరిగెత్తాడు. అక్కడ మరొక తలనెప్పి ఎదురయ్యింది. అక్కడ కూడా బతిమాలాడు, వినతి పత్రాలను ఇచ్చాడు. చివరికి తనకి కావలసింది సాధించాడు. అయితే సరుకుల బోగీలో వాటితోపాటు అతడు కూడా ప్రయాణించవలసి ఉంటుంది.

ఈ ఉరుకులు, పరుగులతో రోజు గడిచిపోయింది. చివరికి రైలు దగ్గర నిలబడినప్పుడు తాను కొనవలసిన వస్తువుల సంగతి అతడికి గుర్తకువచ్చింది. అప్పుడు సమయం మించిపోవటమే కాకుండా, అతడి దగ్గర డబ్బులు కూడా ఎక్కువ లేవు – ఉన్నదంతా హంసలకే ఖర్చయిపోయింది. అక్కడ స్టేషనులో ఉన్న వస్తువులు ఏవో యెగార్ కొన్నాడు. రెండు పూరీలు తిని వచ్చేసరికి రైలు బయలుదేరనే బయలుదేరింది. పంజరంలోని హంసలు బుసలు కొడుతూ, గోలగోలగా అరవసాగాయి. యెగార్ తన కోటు కప్పుకుని పంజరం దగ్గరగా పడుకున్నాడు.

అతడికి కలలో ఏనుగులు కనిపించాయి...

*(తరువాయి భాగం వచ్చే వారం)*

For Latest Telugu Books - Visit now:
Kinige.com